లాలిత్యంగా ఓ క్షణం చూసి "నువ్వెవరివి బాబూ?"

"మా తాతయ్య మనవడన్న మాట....." గర్వంగా అన్నాడు అంత నిస్త్రాణలో కూడా.

"ఎవరయ్యా మీ తాత?" అడిగాడు నానీని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటూ.

" విశ్వేశ్వరశాస్త్రి అంటారే ఆయనన్న మాట!"

నానీ కళ్లు తుడిచాడు "ప్రాణ భీతితో పరుగున వచ్చి శివలింగాన్ని ఆశ్రయం కోరిన నువ్వు మృత్యువాతనుంచి తప్పించుకునే ప్రయత్నంలో శివుడి పాదాల్ని చుట్టేసిన మార్కండేయుడిలాగే ఉన్నావు తండ్రీ! నీకు నేనున్నాను. నాతోరా!" ఆలయానికి పూజారి కూడా అయిన కాశీనాథశాస్త్రి నానీకి ప్రసాదాన్ని నోట్లో వుంచాడు.

ఇన్నాళ్లకు తన మనస్సునర్థం చేసుకున్న మరో తాతయ్య దక్కినందుకు కళ్ళు నీటి కుండలయ్యాయి.

* * * *

చావు బ్రతుకుల మధ్య తవిటయ్య పరిస్థితి ఇంకా ప్రమాదకరంగానే వుంది.

యశస్వి రాత్రి పన్నెండున్నర ప్రాంతంలో హోటల్‌కి తిరిగొచ్చాడు.

ఉద్వేగంగా పోర్టికోలోకి నడిచాడు. హరిత కారు అక్కడే వుంది అంటే ఊరెళ్ళ లేదు.

లోపల తన ఆగమనం కోసమే నిరీక్షిస్తునట్టు ఫోన్ రింగ్ అవుతూంది !

రిసీవర్ని అందుకున్నాడు యశస్వి "హలో"

"ఇంతసేపూ ఏమయ్యావు యశస్వీ?" హేళనగా ఓ నవ్వు వినిపించింది ఆవలి వేపునుంచి "అవునూ -ఇప్పుడు అర్థరాత్రి దాటిపోయింది. కాబట్టి నిన్ను విష్ చెయ్యాలీ అంటే గుడ్‌మాణింగ్ అనాలా లేక నీ ఉత్సాహానికి వారధి శాశ్వతంగా పడిపోయింది కాబట్టి గుడ్‌నైట్ అనాలా?".

"ఎవర్నువ్వు? దేనికోసం ఈ వేళలో ఫోన్ చేశావు?"

"గుడ్ బాగా నటిస్తున్నావు" అవహేళన ధ్వనించింది మళ్ళీ "నీకు తెలీదా నే నెందుకు ఫోన్ చేస్తున్నది?".

"తెలివిని ప్రదర్శించకు మిష్టర్, యూ ఆర్ ప్లేయింగ్ విత్ పోలీస్ ఆఫీసర్".

"అంటే పోలీసులంతా మేధావులని చెప్పడం నీ ఉద్దేశ్యం అనుకుంటాను".

"అందరి సంగతీ నాకు తెలీదు కాని. నేను మేధావిని కాకపోయినా నీ పంచన చేరే ఆవును కాదని తెలియజేస్తున్నా"

"గుడ్.... తెలివిగా పాయింటుకొచ్చేశావు"

"అవును. తెలివయిన పోలీసాఫీసర్నిగా" యశస్వికి క్రమంగా అర్థం అయిపోయింది అవతలివేపు నుంచి మాట్లాడుతున్నది హరే అయ్యుంటాడని.... "చెప్పు ఒక మనిషి నీ అదుపులోకి తీసుకున్నంత మాత్రాన నేను నీకు లొంగుతాననుకున్నావా" తూచి తూచి ఓ అస్త్రాన్ని సంధించాడు.

"అంటే హరిత మా దగ్గరే వుందని తెలిసిపోయిందన్న మాట" యశస్వి అంచనా నిజం చేస్తూ వెంటనే జవాబు వచ్చింది.

"ఏం చేద్దామని మీరు ఈ మార్గంలో అడుగుపెట్టారు?"

"కాస్త నీ మార్గాన్ని మళ్ళిద్దామని"

"ఇలాటి చీప్ టెక్నిక్స్‌తో నన్ను సాధించగలననుకుంటున్నారా?" కోపంగా అన్నాడు "హరిత ఎవరో తెలుసా?"

"పెళ్ళి కాకుండానే ఒకే గదిలో కాపరం పెట్టిన మీరు కనీసం ప్రేమికులయినా అయి వుంటారుగా!".

"రైట్! నేను హరితని ప్రేమించాను. అంతకన్నా నా డ్యూటీని ప్రేమిస్తాను."

"అంటే హరితకేమైనా పర్వాలేదంటావు"

"అని నేనను నేస్తం! ఆ తర్వాత మీరేమయ్యేది కాస్త ఆలోచించమంటున్నాను."

"ఆ తర్వాత మాకేమీ కాకూడదనేగా మేం హరితని అదుపులోకి తీసుకుంది."

"విషయానికి సూటిగా వస్తే సంతోషిస్తాను."

"వెల్! అయితే విను. వచ్చిన కొద్ది రోజుల్లోనే చాలా కథ నడిపించావిక్కడ. ఇప్పుడు నువ్వు రంగంలోనుంచి తప్పుకోవాలి ముందుకిక సాగకుండా తోకముడిచి మీ వూరు, అదే అనకాపల్లి వెళ్ళిపోవాలి. మా గురించి పత్రికల పరంగా గాని మరే విధంగా కాని పెదవి విప్పకూడదు."

"అవును.... విప్పితే పదవిపోతుంది."

"మిస్టర్ యశస్వీ....యూ ఆర్ ప్లేయింగ్ విత్ ఫైర్"

" మిస్టర్ హరీ! నువ్వు పరపతిగల క్రిమినల్‌వేగాని తెలివయిన క్రిమినల్‌వికాదు.... ఈ చదరంగంలో ఆఖరి ఎత్తు వేశామని మీరనుకుంటున్నారు. కొన్ని నిమిషాల క్రితమే మీ బాస్‌కి 'షా' చెప్పే చివరి ఎత్తువేసి ఇలా వచ్చానని నేను తెలియజేస్తున్నాను..."

ఓ క్షణం మౌనం తర్వాత.

"ఏమిటది?" అన్నాడు హరి.

"కాస్త గుండె చిక్కబట్టుకో...."

"ఇన్ని రోజులూ ఏ పసికందుని చంపాలని మీరంతా వేటాడుతున్నారో, ఆ నానీ ఇందాక సరిగ్గా ఒక గంట క్రితమే నా చేతికి

చిక్కాడు. ఆశ్చర్యపోకు, దక్కాడన్న సంతృప్తేగాని నానీ ఈ రాక్షసవేటలో బాగా అలసి సొమ్మసిల్లి పోయాడు. ఇంచుమించు భయంతో మతిభ్రమించిన స్థితిలో వుండటంతో ఇప్పటికి మీరు అదృష్టవంతులయిపోయారు. కాబట్టే ఆ ఫిల్మ్‌రోల్ ఎక్కడ వుందీ నేనూ తెలుసుకోలేకపోయాను"

ఇలా చెప్పటంతో ఎంత రిస్కుందో యశస్వికి తెలుసు. ఒకవేళ నానీ ఆచూకీ వాళ్లకి తెలిసి వుంటే వెంటనే అవతలివేపు నుంచి రియాక్షన్ వినిపించేది.

తెలీదు కాబట్టే నిశ్శబ్దంగా వున్నారన్న తర్కానికి అవకాశమిచ్చింది.

"సో....అదన్నమాట నీ ధైర్యం. సరే..... నానీ యిప్పుడు నీ దగ్గర వున్నాడన్న గ్యారంటీ ఏమిటి?"

"నిరూపించలేకపోవడం నిజంగా నా దురదృష్టం జంటిల్‌మేన్..... నిజానికి నేను ఈ క్షణంలో ఎక్కువ సంతృప్తిని పొందుతున్నది నాని సురక్షితంగా వుండటం వల్ల. ప్రస్తుతానికి హాస్పటల్లో భద్రంగా వున్నాడు కాస్త కోలుకున్నాక ఆ ఫిల్మ్ సంగతి తెలుసుకోగలను. నానీ ఎక్కడున్నదీ మీరు వెదికే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేదు . ఒకవేళ ఈ లోగా నానీ కాన్షస్‌లోకి వస్తే నేనే ఫోన్‌లో మాట్లాడిస్తాను ఓకే.....డాక్టర్ చెప్పినదాన్ని బట్టి సెడిటివ్‌తో నిద్రపోతున్న నానీ బహుశా రేపు మధ్యాహ్నానికల్లా మామూలు స్థితికి చేరుకుంటాడు. అప్పుడు ఏం చేయాల్సిందీ నిర్ణయించుకుందాం. అందాక గుడ్‌బై..... మరో విషయం ఈ లోగా మీరు హరితని విడిచిపెడితే నయం. ఎందుకంటే హరిత ఎవరూ? అమె బేక్‌గ్రౌండేమిటో మీరు వూహించకుండా కిడ్నాప్ చేశారు కాబట్టి"

ఈ మహాయజ్ఞంలో తన వోటమికి కావలసిన చివరి సమిధని మండించారు ప్రత్యర్థులు.

ఇంతదాకా నానీని రక్షించడమే అతడి సమస్యయితే ఇప్పుడు హరిత బాధ్య త నెత్తిపై పడటంతో కణతలు నొక్కుకున్నాడు టెన్షన్‌గా.

హఠాత్తుగా రామసూరి గుర్తుకొచ్చాడు. ఈ పోరాటంలో అతడికి మార్గాన్ని చూపగలిగే ఒకే ఒక్క ఆధారం అతడే.

బయలుదేరాడు అర్థరాత్రి వేళనే.

అంతా విన్నా రామసూరి సైతం ఆందోళనగా చూశాడు "చెబుతూనే వున్నాను యశస్వీ!

ప్రత్యర్థులు ఆఖరి ఎత్తు వేసారు అదికూడ కాదు నన్నింతగా కదిలిస్తున్నది. ఇప్పుడు హరితని చేజిక్కించుకోవడం అంత సులభమయిన విషయంకాదు. హరిత బ్రతకాలి అంటే ఎప్రోచ్ కావల్సింది పోలీసుల్ని కాదు, నానీని చేజిక్కించుకోవాలి. ఒకవేళ పొరపాటున నానీ అటువాళ్ళకి దక్కితే అప్పుడు ఫోన్‌లో నువ్వు చెప్పింది అబద్ధమని వాళ్లకు తెలిసిపోతుంది. ఆ క్షణమే నిన్ను కోరుకునే హరిత చివరి క్షణమౌతుంది."

భావరహితంగా చూశాడు యశస్వి.

"ఇప్పుడు వాళ్ల నెక్స్ట్ మూవ్ ఏమౌతుందంటారు?"

"నానీ వాళ్లకు చిక్కేవరకూ హరిత వాళ్ల కస్టడిలోనే వుంటుంది. ముందు నానీని కడతేర్చడం, వెంటనే హరిత కథ ముగించడం వరుసగా జరుగుతుంది. అంటే-" ఒక్క క్షణం ఆగాడు సాలోచనగా. "ఎల్లుండి నువ్వు నానీని కోర్టులో హాజరు పర్చాల్సిన సమయానికి బహుశా నానీ శవమే మిగులుతుంది- హరిత-"

"నో అలా జరగనివ్వను-" యశస్వి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"ఏం చేస్తావు యశస్వీ- ఇన్ని రోజులుగా నానీ ఎక్కడున్నాడో కూడా తెలీని నువ్వు ఇప్పుడు హరిత ఎక్కడుందీ ఎలా తెలుసుకోగలవు?

శాంతి భద్రతల చేనుని రక్షించాల్సిన కంచే మేస్తుంటే ఎలా నువ్వు వాళ్లని కాపాడగలవు?"

"రామసూరిగారు! ఇక్కడకు నేనూ, హరిత వచ్చింది నానీకోసం. వెనక్కి వెల్లడమంటూ జరిగితే ముగ్గురమౌతాం. లేదంటే ముగ్గురి కథా ఇక్కడే ముగిసిపోతుంది. వస్తా-!" యశస్వి వుద్వేగంగా వెళ్ళిపోతున్నాడు.

ఆ నిశ్శబ్దపు చీకటి రాత్రి తను నమ్మిన ఒక సత్యం కోసం నిజాయితీగా అలజడి చెందుతూ వెళుతున్న యశస్విని చూస్తూ ఓ క్షణం నిలబడ్డ రామాసూరి వెంటనే ఫోన్ దగ్గరకి నడిచాడు.

ఓ గంటసేపటిదాకా ఫోన్స్ చేస్తునే వున్నాడు రామసూరి వరుసగా ఇక్కడ రామసూరి తన చివరి 'మూవ్' ని చాలా పకడ్బందీగా అమలు పరుస్తున్న విషయం యశస్వికి కూడా తెలీదు.....

తెల్లవారింది ఎప్పటిలాగే.....

కాని అది అన్ని రోజుల్లా లేదు.

దినపత్రికల్లో ఎక్కడ చూసినా నానీ వార్తలే.

"నానీ ఏమయ్యాడు-? నానీ ఉనికి అంతబట్టకుండా పోవడానికి కారనం హోం మినిస్టర్ అప్పారావేనా?"

"తుంపాలకి చెందిన నానీ గనికొండ బాలుదిగా ప్రెస్‌లో చెప్పిన హోం మినిస్టరే నానీని అదృశ్యం చేసి తన తప్పుని కప్పిపుచ్చుకోవడానికి పదివేల బహుమతి ప్రకటించాడా?"

“ఇన్ని గొడవలు జరుగుతున్నా రాష్ట్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఎలా ఊరుకుంటుంది?”

“నానీని కాపాడబోయిన కాటికాపరి తవిటయ్యపై హోం మినిస్టర్ అనుచరులు ఎందుకు హత్యా ప్రయత్నం చేసారు?”